క్లుప్తంగా

వృత్తి విద్యపై అవగాహన



తరలుతున్న గురుకులం విద్యార్థులు

దొరవారిసత్రం: బీసీ గురుకుల పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు, కళాశాలలోని ఇంటర్ విద్యార్థులకు వివిధ రకాల వృత్తి విద్యపై నైపుణ్యంతో పాటు అవగాహన కల్పించేందుకు గూడూరులోని ఆదిశంకర కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆదిశంకర కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్, ఎలక్ట్రానిక్ ల్యాబ్, ఈఈఈ ల్యాబ్, సీఎస్ఈ ల్యాబ్‌తో పాటు వర్క్‌షాపులను సందర్శించారు. వీటి ప్రత్యేకతలపై అక్కడ ఉన్న టీచర్లు విద్యార్థులకు తెలియజేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరుపతయ్య, ఉపాధ్యాయుడు రమణ, ఒకేషనల్ టీచర్ అమల పాల్గొన్నారు.

రాపూరులో రక్తదాన శిబిరం



రక్తదానం చేసిన దాతలకు బిస్కెట్లు అందిస్తున్న ఎస్ఐ వెంకటరాజేష్

రాపూరు: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రాపూరు ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటరాజేష్ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం చేస్తుందన్నారు. రక్తాన్ని కృత్రిమంగా సృష్టించలేమని అందరూ రక్తదానం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలతోనే ఎక్కువగా రక్తం పోతుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారు నడిపేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని ఆయన సూచించారు. పోలీసులు విధి నిర్వహణలో ఎంతో సేవ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వరావు, వైద్యులు రేష్మ, హరీష్, సరస్వతి, రక్త దాతలు పాల్గొన్నారు.

మేత భూముల్లో అక్రమ లేఅవుట్

పెళ్లకూరు: మండలంలోని పునబాక గ్రామంలో ఉన్న మేత భూముల్లో కొందరు పెత్తందారులు అక్రమంగా లేఅవుట్ వేసి ఒక సెంటు భూమి రూ.1లక్ష చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామంలోని సర్వే నంబరు 335లో 5.30ఎకరాలు, సర్వే నంబరు 336లో 8.40ఎకరాలు మొత్తం 13.70 ఎకరాల మేత భూమి ఉంది. అయితే అదే గ్రామానికి చెందిన కొందరు పెత్తందారులు మేత భూముల్లో నామమాత్రంగా హద్దులు ఏర్పాటు చేసి ఒకసెంటు భూమి రూ.1లక్ష చొప్పున ఐదేసి సెంట్లు ప్లాట్లు వేసి విక్రయించేస్తున్నారు. దీనిపై సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయిని వివరణ కోరగా మేత భూముల విషయమై పూర్తి స్థాయిలో పరిశీలించి, ఆక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

భూ కబ్జాను అడ్డుకోండి

నాయుడుపేట టౌన్: బిరదవాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా అడ్డుకోవాలంటూ గ్రామస్తులు మంగళవారం డీటీ రాజేంద్రకు వినతి పత్రాన్ని అందించారు. బిరదవాడ గ్రామస్తులు మాట్లాడుతూ భూకబ్జాపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కాపాడుకుంటామని గ్రామస్తులు వెల్లడించారు. బిరదవాడ వద్ద ఉన్న భూమిని పేదలకు పంపిణీ చేయాలని కోరారు.

సైన్స్‌పై అవగాహన అవసరం

గూడూరు రూరల్: చిన్నతనం నుంచే సైన్సుపై అవగాహన పెంచుకుని, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయిలో చెకుముకి పోటీలలో విజేతలుగా నిలిచి విద్యార్థులకు జేవీవీ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. నారాయణ, నాగరాజు, శ్రీనివాసాచారి, సుమన్‌రెడ్డి, చెంచునారాయణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో వ్యాధులు దూరం

చిల్లకూరు: ఆయుర్వేదం ద్వారా పలు వ్యాధులను నయం చేయవచ్చని మోమిడిలోని ఆయుర్వేద వైద్యులు కలపాటి శేఖర్ తెలిపారు. మండలంలోని మోమిడి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం 9వ జాతీయ ఆయుర్వేద వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు ఆయుర్వేదంపై అవగాహన కల్పించి, వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎం రీటా, సబార్డినేట్ హైమావతి, సచివాలయ సిబ్బంది నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

డక్కిలి: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జున సాగర్ అన్నారు. మండలంలోని దగ్గవోలు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఐ.రాజీవన్ మాట్లాడుతూ నిమ్మ సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారి విజయభారతి, పశు వైద్యాధికారి కిషోర్, వీఏఓలు శ్రీహరి, హరి తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం.. నాణ్యత శూన్యం

వందలాది ఎకరాల సాగు భూములకు అవసరమైన పొర్లు కట్ట గండిని పూడ్చేందుకు చేపట్టిన పనులు పూర్తిగా నాసిరకంగా ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కురిసిన వానలు, వరదలకు తడ మండలం, వాటంబేడు గ్రామానికి ఎగువన ప్రవహిస్తున్న కాళంగి నదికి రెండు చోట్ల భారీ గండ్లు ఏర్పడ్డాయి. వీటిని పూడ్చేందుకు అప్పట్లో ప్రతిపాదనలు సిద్ధం చేసి, టెండర్ల ద్వారా పనులు కేటాయించారు. ఒక గండిని పూడ్చేందుకు రూ.35 లక్షలు, మరో గండికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. అనంతరం ఎన్నికలు రావడంతో పనులు మొదలు కాలేదు. ఎట్టకేలకు ఈ ఏడాది ఆగస్టులో పనులు మొదలు పెట్టారు. లక్షల నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ చేసిన పనిలో ఏ మాత్రం నాణ్యత లేకపోవడంతో అక్టోబర్‌లో కురిసిన వానలకు కట్టలకు పోసిన మట్టి పూర్తిగా కరిగి పోయింది. మరో వాన కురిస్తే తెగేందుకు సిద్ధంగా ఉంది. – తడ



మట్టి జారిపోయిన కాళంగి పొర్లుకట్ట

- కాళంగి కట్ట గండి పనుల్లో నాణ్యత లేమి
- తేలికపాటి వానలకే కరిగిపోయిన కట్ట
- పనులపై రైతుల ఆందోళన
- టీడీపీ నాయకులు, అధికారులకు భారీగా నజరానా

నాణ్యత శూన్యం

పెద్ద గండి కావడంతో ఎక్కువ మట్టిని వినియోగించి పనులు చేయాలి. అందుకు అనువైన మట్టిని నిపుణుల సూచన మేరకు దూరం నుంచైనా సేకరించి తేవాల్సి ఉంది. అలా కాకుండా కేవలం సమీపంలో అందుబాటులో ఉన్న మట్టినే కట్టల మరమ్మతులకు వినియోగించేశారు. ఆ మట్టి వానలకు నిలవలేదు. అదే సమయంలో మట్టి పోసిన వెంటనే తగిన విధంగా గట్టిపరిచే యంత్రాలతో మట్టిని తొక్కకుండా కేవలం పైపైనే పోసి వదిలేశారు. దీంతో మట్టి కట్టమీద గట్టిపడకపోవడంతో కొద్దిపాటి వానలకే కరిగి పోయింది.

సాగుకు ఇబ్బంది

గత ఏడాది వచ్చిన వరదల్లో ఈ గండి పడ్డ ప్రాంతంలో వాటంబేడు శివాలయానికి చెందిన 350 ఎకరాల మాన్యంతోపాటు ఇతర రైతులకు సంబంధించిన వందలాది ఎకరాల భూముల్లో చేతికి అందిన వరి పంట నష్టపోయారు. ఈ ఏడాది కూడా కట్టకు పటిష్ట చర్యలు చేపట్టకపోతే రైతులు వ్యవసాయం చేసుకునేందుకు ధైర్యం చేసే పరిస్థితి లేదు. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు చాలా మంది రైతులు కనీసం దుక్కి దున్నే సాహసం కూడా చేయలేదు.



బలహీనంగా కాళంగి కట్ట

అధికారుల అండదండలు

గండి పడ్డ ప్రాంతం గ్రామానికి సుమారు నాలుగు కిలో మీటర్లు ఉంది. అలవాటైన రైతులు తప్ప ఇతరులు ఎవ్వరూ అక్కడకు చేరుకోలేని విధంగా దారి ఉంది. దీంతో కట్టపని ఎలా చేసినా ఎవరూ అడగరన్న ధైర్యంతో పని చేసేశారు. దీనికి తోడు పర్సంటేజీలు తప్ప పనుల్లో నాణ్యతపై పెద్దగా ఆసక్తి లేని అధికారులుండడం విశేషం. నాకేంటి అనే తీరులో ఉన్న అధికార పార్టీ నాయకుల అండతో కాంట్రాక్టర్ ధైర్యంగా పనిని పూర్తి చేసి 'మమ' అనిపించినట్టు రైతులు విమర్శిస్తున్నారు. రైతులు ఇప్పటికే ఒకసారి పంట నష్ట పోయారు. ఈ ఏడాది కూడా వ్యవసాయం చేసేందుకు సరైన భరోసా లేకపోవడంతో నవంబర్ వస్తున్నా ఇంత వరకు దుక్కి కూడా మొదలు పెట్టని దుస్థితిలో రైతులు ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడి భూములను నమ్ముకుని జీవనం సాగిస్తున్న దళితులు, పేదలకు వెంటనే న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కట్ట పనులను సరైన విధంగా చేయకపోతే ఆందోళన చేపడుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

దగ్గర్లో దొరికిన మట్టినే వాడారు



నిపుణుల సూచన మేరకు కట్ట పనులకు వాడాల్సిన మట్టితో కాకుండా దగ్గర్లో దొరికి మట్టితోనే కట్టకు రూపు తెచ్చి పని అయిందని చేతులు దులిపేసుకున్నారు. ఒక్క నెల కూడా గడవక ముందే కురిసిన వానలకు కట్ట కరిగిపోయి పూర్తిగా పాడైపోయింది. ఇలాంటి కట్టను నమ్మి రైతులు వ్యవసాయం చేసే ధైర్యం చేయలేరు. అధికారులు స్పందించి, కట్ట పనులు పరిశీలించి రైతులకు భరోసా ఇవ్వండి. గతంలో ప్రతి పనికీ తప్పులు వెతికే టీడీపీ నాయకులు ఇంత పెద్ద పని విషయంలో నోరు మెదపక పోవడానికి కారణం తెలియడం లేదు. **- మన్నా నరేష్‌రెడ్డి, రైతు, వాటంబేడు**

రైతులకు భరోసా ఇవ్వండి



వానలు వచ్చే సమయంలో కట్ట పనులు మొదలు పెట్టారు. అది కూడా సరైన పద్ధతిలో గట్టిగా చేయకుండా మట్టిని పోగు పోసి పనులు అయ్యామనిపించారు. ఇప్పటికే గత ఏడాది జరిగిన నష్టానికి రైతులు కోలుకోలేకుండా ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మరోమారు నష్టపోవడానికి సిద్ధంగా లేరు. వ్యవసాయం తప్ప మరో బతుకు తెలియని దళితులు, నిరుపేదలే ఇక్కడ వ్యవసాయం చేసున్నారు. వ్యవసాయ ఫలాలు లేకుండా రెండేళ్లు జీవించాలంటే అప్పులపాలై తీవ్ర ఇబ్బందులు పడతారు. అధికారులు కలగజేసుకుని ప్రలోభాలకు లొంగకుండా కట్టను దగ్గర ఉండి బాగుచేయించి రైతులకు భరోసా కల్పించాలి.

- కె.మునుస్వామి, రైతు, వాటంబేడు

ఉపయోగం లేని పనులు



గతంలో పడ్డ గండి కారణంగా మా పొలం మొత్తం పాడైపోయింది. దానిని పూడ్చేందుకు మా పొలంలో మా అవసరాలకు తోలిపెట్టిన మట్టినే కట్టకు పోసేశారు. అది పొలం చదును చేసేందుకు పనికివచ్చే మట్టి తప్ప కట్టల పటిష్టతకు ఏ మాత్రం ఉపయోగపడదు. ఇలాంటి మట్టితో పని చేస్తే కట్ట నెలలు తిరక్కుండానే పాడైపోయింది. ఇలాంటి కట్ట వల్ల ఎవరికీ ఉపయోగం లేదు.

- ఎం సుకుమార్, రైతు వాటంబేడు

పని మొత్తం పరిశీలించాకే బిల్లు



పని చేసిన వెంటనే వానలు రావడంతో కట్ట కొంత కరిగి పోయింది. దీనిని మళ్లీ అదే కాంట్రాక్టర్‌తో బాగు చేయించి రైతులకు ఇబ్బంది కలగకుండా చేస్తాం. దగ్గర్లో ఉన్న పెద్ద కట్టకు మాత్రం రోలింగ్ సజావుగా సాగడంతో అది బాగుంది. చిన్న గండికి పనులు జరిగే సమయంలో వానలు రావడంతో దారి సరిగా లేని అక్కడికి రోలింగ్ చేసే వాహనాలు వెళ్లడానికి సమస్య నెలకొంది. ఇంతలో వానలు పెద్ద ఎత్తున రావడంతో అప్పుడే పోసిన మట్టి కొంతమేర కరిగిపోయింది. ఈ సారి దానిని పూర్తి చేయిస్తాం. ఏది ఏమైనా పనులు సంతృప్తికరంగా ఉంటేనే బిల్లులు తయారు చేస్తాం.

- శ్రీధర్, ఇరిగేషన్ డీఈ, సూళ్లూరుపేట

రోడ్డు నిర్మాణ పనులకు రైతులు సహకరించాలి

కోట: సాగరమాల రోడ్డు నిర్మాణ పనులకు రైతులు సహకరించాలని కోట, వాకాడు తహసీల్దార్లు జయజయరావు, రామయ్య కోరారు. మంగళవారం కొత్తపాళెంలో రైతులతో అధికారులు సమావేశం నిర్వహించారు. కోట మండలంలో కొత్తపాళెం, నెల్లూరుపల్లి, అగ్రహారం గ్రామాల్లో సాగరమాల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు పరిహారం అందలేదని కొందరు రైతులు అడ్డు చెప్పడంతో గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశాల మేరకు అధికారులు ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. 30 మంది వరకు రైతులకు పరిహారం చెల్లించాల్సి ఉందని భూములకు సంబంధించి పూర్తి ఆధారాలు సమర్పిస్తే వెంటనే వారి ఖాతాలో నగదు జమ చేస్తామన్నారు. డీటీ అజంతుల్లాఖాన్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు



తల్లంపాడు సంపద తయారీ కేంద్రం వద్ద శుభ్రతా పనులు

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రాల్లో చెత్తాచెదారం తొలగించారు. గ్రామ సచివాలయాల సిబ్బంది, పంచాయతీ పాలకులు చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేసే పనులు చేపట్టారు. మంగళవారం ‘సాక్షి’లో శిథిలావస్థలో సంపద కేంద్రాలు’ అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. దీంతో పాటు సచివాలయం సిబ్బంది, పంచాయతీ పాలకులు స్పందించి తల్లంపాడు, తనియాలి తదితర ప్రాంతాల్లో ఉన్న సంపద కేంద్రాల్లో చెత్తాచెదారం తొలగించారు.

సముద్రంలో సుడి గుండాలు

వాకాడు: ఇటీవల వరుస అల్పపీడనాలతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. తీరం కోతకు గురై అతి భయంకరమైన సుడి గుండాలు ఏర్పాడ్డాయి. ఈ క్రమంలోనే వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో శిథిలావస్థలో ఉన్న ఉప్పునీటి ఎత్తిపోతల జెట్టీ ప్రదేశంలో ఇరువైపులా సుడి గుండాలు ఏర్పడ్డాయని, అటు వైపు ఎవ్వరూ వెళ్లొద్దని స్థానిక మత్స్యకారులు హెచ్చరిస్తున్నారు. నవంబర్ 2న కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో భక్తులు తూపిలిపాళెం తీరంలో సముద్ర స్నానాలు అచరించనున్నారని, అందుచేత జెట్టీ ప్రాంతానికి ఎవ్వరూ వెళ్లకుండా దగ్గరలో ఉన్న తొలి ఘాట్‌లోనే స్నానాలు ఆచరించాలని సూచించారు. దుగ్గరాజపట్నం మెరైన్ సిబ్బందికి సహకరించి వారి ఆదేశాల మేరకు భక్తులు సముద్రంలో చెప్పారు.

పరిశ్రమల రాకతో గ్రామీణాభివృద్ధి

సైదాపురం: పరిశ్రమల రాకతో గ్రామీణాభివృద్ధి సాధ్యమని, ప్రజల అభిప్రాయాలను కూడా అమలు చేయాల్సిన బాధ్యత మైనింగ్ యజమానులపైనే ఉందని నెల్లూరు ఆర్డీఓ నాగసంతోష్ అనూష వెల్లడించారు. మండలంలోని పెరుమాళ్లపాడు సమీపంలోని జాన్వీ ఇన్‌ఫ్రా కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పెరుమాళ్లపాడు గ్రామంలోని సర్వే నెంబర్ 677పిలో 6.074 హెక్టార్లలో మైనింగ్ కార్యకలాపాలను నిర్వహించేందుకు పర్యావరణం అనుమతుల కోసం ఈ ప్రజాభిప్రాయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం ప్రజలు, నాయకులతోపాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు పలు సమస్యలను కమిటీ ముందుంచారు. పర్యావరణాన్ని కాపాడుకుని పరిశ్రమలు అభివృద్ధి సాధించాలని ఆమె కోరారు. ఈ మైనింగ్‌తో గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని గ్రామస్తులు స్పష్టం చేశారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఆర్డీఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ అధికారి అశోక్‌కుమార్, తహసీల్దార్ ఇ.రమాదేవి, సీఐ విజయకృష్ణ, మైన్ యజమాని జె.నితిన్, ఎస్ఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ

బంగారం, వెండి అప్పగింత

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన దేవస్థానం ఏసీగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన సాగర్ బాబు మంగళవారం ఆలయానికి సంబంధించిన బంగారం, వెండి ఆభరణాలను గుంటూరు జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి శ్రీనివాసరావు సమక్షంలో తిరిగి అప్పగించినట్లు పెంచలకోన ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. స్వామి, అమ్మవార్లకు సంబంధించిన ఆభరణాలు, హుండీలో భక్తులు వేసిన బంగారు, వెండి వస్తువులను దేవదాయశాఖ జ్యువెలరీ అధికారుల సమక్షంలో స్వాదీనం చేసినట్లు ఆయన వివరించారు. ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, దేవస్థానం సిబ్బంది లక్ష్మీనారాయణ, వినోద్ తదితరులు ఉన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

రాపూరు: నవంబర్ 15న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని రాపూరు ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో అరుణాచలానికి పొదలకూరు, కలువాయి నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ బస్సులు నవంబర్ 14వ తేదీ పొదలకూరు, కలువాయి నుంచి రాపూరు, డక్కిలి మీదుగా కాణీపాకం, సిరిపురం ఆలయాల్లో దర్శనానంతరం అరుణాచలంకు చేరుకుంటాయన్నారు. గిరిప్రదక్షణ, దర్శనం అనంతరం అరుణాచలంలో నవంబర్ 15 మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి రాత్రికి పొదలకూరు, కలువాయికి చేరుకుంటాయని ఆయన వివరించారు. టిక్కెట్ ధర రూ.1300 అని, భక్తులు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 63030 36216, 72055 93111, 73828 86451 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

న్యాయం జరిగే వరకు చట్టపరమైన పోరాటం

పెళ్లకూరు: టీడీపీ నాయకుల కుట్రలకు బలైన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త బండి చెంచయ్య(48) కుటుంబానికి న్యాయం జరిగే వరకు చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని డీసీసీబీ మాజీ చైర్మన్, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 23న చిల్లకూరు వడ్డిపాళెం గ్రామం, స్వర్ణముఖి నది తీరం వద్ద మృతి చెందిన చెంచయ్యను కొందరు టీడీపీ వర్గీయులు హత్య చేశారని, బాధిత కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. వారం రోజులు గడుస్తున్నా పోస్టుమార్టం నివేదిక అందకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేక నిపుణుల మధ్య అనుభవజ్ఞులైన వైద్యులతో రీపోస్టుమార్టం నిర్వహించి వెంటనే నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను కోర్టు ఆదేశించింది. దీనిపై కామిరెడ్డి మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు చట్టపరంగా పోరాడుతామని పేర్కొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి

గూడూరు రూరల్: పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ కృషి చేయాలని రోటరీ క్లబ్ సీనియర్ సభ్యుడు, వైఎస్ఆర్ సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి సూచించారు. రెండో పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం మొక్కల పెంపకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ వారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. సీనియర్ రొటేరియన్ శ్రీకంఠి రామోహన్‌రావు, క్లబ్ అధ్యక్షుడు నాశిన నాగులు, ప్రధాన కార్యదర్శి చోళవరం గిరిబాబు, సభ్యులు పీఎం రావు, క్రిష్ణంరాజు, వాసు, బలరామిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, వెంకటక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడివేడిగా కౌన్సిల్ సమావేశం

సూళ్లూరుపేట: అవసరం లేని అంశాలను ఎజెండాలో పొందుపరచడంపై మున్సిపల్ పాలకవర్గాన్ని కౌన్సిల్ సభ్యులు వాడివేడిగా ప్రశ్నించారు. పట్టణంలోని స్త్రీశక్తి భవన్‌లో మంగళవారం సాయంత్రం మున్సిపల్ సాధారణ సమావేశం కమిషనర్ చిన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా అజెండాలో పొందుపరిచిన 20 అంశాలను చదివి సమావేశంలో వినిపించారు. ఇందులో విజయవాడ వరద బాధితులకు తాగునీటి బాటిళ్ల సరఫరా, సాయినగర్‌లో ఓవర్‌హెడ్ ట్యాంక్ కూల్చడం, పశువులు, పందులు, కుక్కల స్వైర విహారం చేస్తుండడం, వినాయకుడి గుడి సమీపంలో పాండురంగవీధిలో కల్వర్టు కుంగిపోవడం తదితర అంశాలు అజెండాలో చేర్చకపోవడంపై సభ్యులు ప్రశ్నించారు. విజయవాడ వరద బాధితులకు వాటర్ బాటిళ్ల సరఫరా విషయంలో అవకతవకలున్నాయని, ఈ అంశాన్ని ఆమోదించమని సభ్యులంతా చెప్పడంతో దాన్ని రద్దు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక పరమైన సమస్యలతో ఇబ్బందులు పడుతోందని, అయినా సరే అందరం కలిసి కట్టుగా ఉండి మున్సిపాలిటిని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్లు పోలూరు పద్మ మిల్టన్, చిన్ని సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశాన్ని నిర్వహిస్తున్న కమిషనర్ చిన్నయ్య